సాక్షి
కుమురం భీం

సోమవారం । 30 । డిసెంబర్ । 2024

జీవన వైవిధ్యం..
ప్రాణహితం

మదిని మైమరిపించే ప్రకృతి అందాలు.. జన జీవనానికి ఉపాధి నిచ్చే అవకాశాలు.. జీవాలకు ప్రాణం పోసే వనరులు.. ఇవన్నీ కలిసిన ప్రాంతం ప్రాణహిత నదీ తీరం.

- మిగతా 8లో▸



న్యూస్‌రీల్

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఆత్రం స్వప్న



శ్రావణి

రెబ్బెన: జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు రెబ్బెన మండలం గోలేటికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.నారాయణరెడ్డి తెలిపారు. ఈ నెల 30 వరకు మహారాష్ట్రలోని రైగాడ్ జిల్లాలో జరిగే 70వ సీనియర్ నేషనల్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో గోలేటికి చెందిన ఆత్రం స్వప్న, శ్రావణి తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర జట్టుకు స్వప్న కెప్టెన్‌గా వ్యవహరిస్తుందని వెల్లడించారు. క్రీడాకారులను అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, పీఈటీ భాస్కర్, షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, కోశాధికారి శంకర్, అంతర్జాతీయ రెఫరీ మల్లేశ్, సీనియర్ క్రీడాకారులు లక్ష్మణ్, సదానందం, సాంబయ్య, లింగారెడ్డి, హరిలాల్, మల్లేశ్, రామకృష్ణ తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్య పతకం



జిల్లా క్రీడాకారులతో అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లా జట్టు కాంస్య పతకం సాధించినట్లు తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ స్టేడియంలో ఈ నెల 27 నుంచి 29 వరకు జరిగిన సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకా రులు అద్భుత ఆటతీరు ప్రదర్శించారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో నూ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడాకారులు ఆర్.వెంకటేశ్, కె.తిరుమలేశ్, ఎ.రాజేందర్, పి.రాజశేఖర్, కె.రాజశేఖర్, సీహెచ్ శ్రీకాంత్‌ను జిల్లా యువజన స్పోర్ట్స్ అధికారి రమాదేవి, స్పోర్ట్స్ అధికారి మీనారెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ సాగర్, ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.నారాయణరెడ్డి, సెపక్‌తక్రా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాస్కర్, రామకృష్ణ, మల్లేశ్ అభినందించారు.

సాంస్కృతిక శిక్షణకు ఉపాధ్యాయుడి ఎంపిక



సుందిళ్ల రమేశ్

కాగజ్‌నగర్‌రూరల్: అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో 15 రోజుల శిక్షణా కార్యక్రమానికి తెలంగాణలోని పదిమంది నిష్ణాతులైన ఉపాధ్యాయులను ఎంపిక చేయగా, కాగజ్‌నగర్ మండలం చారిగాం పాఠశాలకు చెందిన సుందిళ్ల రమేశ్ అనే ఉపాధ్యాయుడు ఎంపికయ్యాడు. ఈ శిక్షణ ద్వారా బొమ్మలతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారి ఉన్నతికి పాటుపడతానని సుందిళ్ల రమేశ్ పేర్కొన్నారు. జనవరి 2 నుంచి 16 వరకు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయని తెలిపారు. శిక్షణకు ఎంపికైన సుందిళ్ల రమేశ్‌ను ఎంఈవో ప్రభాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

యోగా పోటీల్లో ప్రతిభ



ప్రశంసాపత్రాలతో కౌటాల విద్యార్థినులు

కౌటాల(సిర్పూర్): బెల్లంపల్లిలో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో కౌటాల విద్యార్థులు ప్రతిభ చూపారని యోగా గురువు దాసరి వినోద్ తెలిపారు. బాలికల విభాగంలో దాసరి ధార్మిక ప్రథమ స్థానం, నికాడే యశ్విత ద్వితీయ స్థానంలో నిలిచారని, బాలుర విభాగంలో నాగచైతన్య, అఖిల్ సింగ్ ప్రతిభ చూపారని అన్నారు. యోగాతో ఆరోగ్యంగా మెరుగుపడుతుందని, ప్రజలు జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. విజేతలను తల్లిదండ్రులు, శిక్షకులు అభినందించారు.

కాస్త మెరుగు..!



పరీక్ష రాసి వస్తున్న పదో తరగతి విద్యార్థులు(ఫైల్)

- జిల్లాలో 281 మంది కొత్త ఉపాధ్యాయుల నియామకం
- పాఠశాలల మరమ్మతులకు రూ.25.50 కోట్లు
- నూతన ఎంఈవోలతో పెరిగిన పర్యవేక్షణ
- రెగ్యులర్ డీఈవో లేక అవస్థలు
- 'పది' ఉత్తీర్ణత అంతంతే.. ఇంటర్‌లో ఆశించిన ఫలితాలు



ఆసిఫాబాద్‌రూరల్: 2024 సంవత్సరంలో విద్యా రంగం కాస్త మెరుగుపడింది. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేయడంతో కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరడం ఊరట కలిగించింది. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద బడుల్లో మరమ్మతులు, రూం టు రీడ్ సహకారంతో ప్రతీ మండలంలోని ఓ స్కూల్‌లో మోడల్ లైబ్రరీ ఏర్పాటు, మెస్, కాస్మెటిక్ చార్జీల పెంపు తదితరాలు ఈ ఏడాది సానుకూల అంశాలు. మరోవైపు వసతి గృహాల్లో విద్యార్థులు అనారోగ్యం పాలుకావడం, ముగ్గురు మృత్యువాత పడటం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం సర్వ శిక్షా ఉద్యోగుల సమ్మెతో కేజీబీవీల్లో బోధన నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది.

బడుల కోసం రూ.25.50 కోట్లు

గత ప్రభుత్వం మన ఊరు- మన బడి పథకం కింద పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టింది. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్‌ఎంసీలను రద్దు చేసింది. పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసింది. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో 685 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా రూ.25.50 కోట్ల నిధులు విడుదల చేసింది. మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, ప్రహరీ, ఇతర మరమ్మతులు చేపట్టారు. ఈ బాధ్యతలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగించారు. జిల్లాలో 2024లో 223 పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం కల్పించగా, 202 చోట్ల చిన్న తరహా మరమ్మతులు చేపట్టారు. 15 అర్బన్ స్కూళ్లు, 140 గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించారు. 67 చోట్ల విద్యుత్ పనులు చేపట్టారు.

'పది'లో అట్టడుగు.. ఇంటర్‌లో టాప్



జిల్లాలో కొన్నేళ్లుగా పదో తరగతిలో ఆశించిన ఫలితాలు రావడం లేదు. 2021- 22 విద్యా సంవత్సరంలో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా 79 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 32వ స్థానం, 2022- 23లో 75 శాతంతో 30వ స్థానం, 2023- 24లో 77 శాతంతో రాష్ట్రంలో 31వ స్థానంలో నిలిచింది. ఉపాధ్యాయుల చేరికతో ఈసారి మెరుగైన ఫలితాలు సాధిస్తామని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇంటర్మీడియెట్ వార్షిక ఫలితాల్లో జిల్లా మెరుగైన ఫలితాలు సాధిస్తోంది. రాష్ట్రస్థాయిలో 1, 2, 3వ స్థానాల్లో నిలుస్తుంది. 2020-21 విద్యాసంవత్సరంలో ఫస్టియర్ ఫలితాల్లో 71 శాతంతో రాష్ట్రంలో రెండో స్థానం సాధించగా, సెకండియర్‌లో 80 శాతంతో మొదటి స్థానం, 2021- 22లో ఫస్టియర్‌లో 3వ స్థానం, సెకండియర్‌లో 2వ స్థానం, 2022- 23లో ఫస్టియర్‌లో 3వ స్థానం, సెకండియర్‌లో 2వ స్థానం, 2023- 24లో ఫస్టియర్‌లో 8వ స్థానం, సెకండియర్‌లో 7వ స్థానం సాధించింది. గత విద్యాసంవత్సరంలో ఫలితాలు కాస్త తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.

కొత్త టీచర్ల నియామకం..

317 జీవో కారణంగా జిల్లాలో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఏర్పడ్డాయి. బోధించే వారు లేక విద్యార్థులు నష్టపోయారు. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ద్వారా 281 టీచర్లను నియమించింది. అలాగే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులతో 320 మంది స్కూల్ గ్రేడ్ టీచర్లు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ పొందారు. ఉన్నత పాఠశాలల్లో చాలా వరకు ఉపాధ్యాయుల కొరత తీరింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో కొంత మేర ఖాళీలు ఉన్నా ప్రస్తుతం సర్దుబాటుతో నెట్టుకొస్తున్నారు. ఇక గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కౌటాలలో మాత్రమే రెగ్యులర్ ఎంఈవో ఉండేవారు. పర్యవేక్షణ కోసం ప్రభుత్వం ఈ ఏడాది 15 మండలాలకు 15 మంది ఎంఈవోలను నియమించింది. ప్రస్తుతం రెగ్యులర్ జిల్లా విద్యాధికారి లేకపోవడం మాత్రం ఇబ్బందిగా మారింది. అశోక్ బదిలీపై వెళ్లిన తర్వాత మంచిర్యాల జిల్లా డీఈవో యాదయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. రెండు జిల్లాలపై పర్యవేక్షణ ఆయనకు కష్టంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెతో కస్తూరిబా విద్యాలయాల్లో బోధనకు ఆటంకం ఏర్పడుతోంది. సీఆర్టీల సమ్మెతో ఏకోపాధ్యాయ గిరిజన ఆశ్రమ పాఠశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడింది.

పెరిగిన మెస్ చార్జీలు



ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలు పెంచింది. దీని ద్వారా డీఈవో పరిధిలోని 702 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 37,948 మంది విద్యార్థులు, 102 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 27,978 మంది విద్యార్థులకు మేలు జరగనుంది. అయితే పెరిగిన ధరల నేపథ్యంలో మెనూ అమలు చేయడం సాధ్యం కాదని మధ్యాహ్న భోజన కార్మికులు, హాస్టళ్ల వార్డెన్లు వాపోతున్నారు.

తీరుమారని 'వసతి'

ఈ ఏడాది కూడా జిల్లాలోని వసతిగృహాల పరిస్థితి మెరుగుపడలేదు. వర్షాకాలం, చలికాలంలో పడరాని పాట్లు పడ్డారు. ఆహారం వికటించి పలువురు విద్యార్థులు అనారోగ్యం పాలయ్యారు. ముఖ్యంగా వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన బాలికల వసతిగృహంలో 60 మందికి పైగా బాలికలు అస్వస్థతకు గురికావడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వివిధ ఆస్పత్రుల్లో బాధితులకు చికిత్స అందించారు. ఇందులో తొమ్మిదో తరగతి విద్యార్థిని చౌదరి శైలజ నిమ్స్‌లో మృతి చెందడం మాయని మచ్చగా మిగిలింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో లక్ష్మి జ్వరంతో.. ఆసిఫాబాద్ బీసీ పోస్ట్ మెట్రిక్ వసతిగృహంలో డీఈడీ విద్యార్థిని వెంకటలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. 2022- 24 మధ్య ఏడుగురు విద్యార్థులు చనిపోయిన విషయం తెలిసిందే.

'అటవీ అధికారుల వేధింపులు సహించం'



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

పెంచికల్‌పేట్(సిర్పూర్): రైతులపై అటవీశాఖ అధికారుల వేధింపులను సహించమని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మురళీగూడ, జిల్లెడ, గొంట్లపేట్, చేడ్వాయి గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. అనంతరం పెంచికల్‌పేట్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అటవీ ప్రాంతాల్లో ఓ వైపు పెద్దపులి దాడులు, మరోవైపు అధికారుల వేధింపులతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల్లో అటవీ అధికారులు పనులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అన్నదాతల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పెద్దపులి దాడిలో గాయపడిన వారికి రూ.పదిలక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాలికొదిలేసిందన్నారు. సర్వశిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద, గిరిజన పాఠశాలల్లోని సీఆర్టీలు ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేద విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని పేర్కొన్నారు. ఆగర్‌గూడ నుంచి గుండెపల్లి, కమ్మర్‌గాం, నందిగామ, మురళీగూడ, జిల్లెడ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను గడపగడపకూ తీసుకుని వెళ్తామని హెచ్చరించారు. ఆయన వెంట నియోజకవర్గ కన్వీనర్ కొండా రాంప్రసాద్, యూత్ కన్వీనర్ కాశిపాక రాజు, మండల అధ్యక్షుడు బిట్టి శ్రీనివాస్, బండి మహేశ్, తిరుపతి, మొండి తదితరులు ఉన్నారు.

'జంగుబాయి' ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో ఆదివారం జంగుబాయి అమ్మవారి ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆవిష్కరించారు. దేవస్థానం చైర్మన్ శ్యామ్‌రావు, సలాం, గిరిజన నాయకులు ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కెరమెరి మండలం కోట పరందోళి బిడ్వార్ గ్రామంలో జనవరి 13 నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

పోలీసు పహారా!

- న్యూఇయర్ వేడుకలపై నిఘా
- మందుబాబులు రోడ్డెక్కితే చుక్కలే..
- జిల్లా అంతటా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు
- ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేస్తే బైక్ సీజ్
- పిల్లలకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు
- ప్రశాంతంగా సంబురాలు చేసుకోవాలని ఎస్పీ సూచన



డీవీ శ్రీనివాసరావు, ఎస్పీ

సాక్షి, ఆసిఫాబాద్: 'డిసెంబరు 31 రాత్రి జిల్లా ప్రజలు నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అపశ్రుతి చోటుచేసుకోకుండా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది. ప్రశాంతంగా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించుకోవడమే లక్ష్యంగా పోలీసులు 31వ తేదీన సాయంత్రం 7 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకూ విధుల్లోనే ఉండనున్నారు. జిల్లాలో ప్రధాన రహదారులతోపాటు అన్ని మండల కేంద్రాల్లోనూ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. మద్యం తాగి బైక్‌లపై ర్యాష్, ట్రిపుల్ రైడింగ్ చేసే మందుబాబులపై కఠినంగా వ్యవహరించబోతున్నాం. బైక్‌లు సీజ్ చేయడమే కాకుండా వారి తల్లిదండ్రులపైనా చర్యలు తీసుకుంటాం' అని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు 'సాక్షి'కి వివరించారు. న్యూఇయర్ వేడుకల బందోబస్తు వివరాలు ఆయన మాటల్లోనే..

ఏ ఒక్క దుర్ఘటన జరగకుండా..

నూతన సంవత్సర వేడుక సందర్భంగా ఏ ఒక్క దుర్ఘటన జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాం. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు, సీసీ కెమెరాలతో నిఘా పెట్టనున్నాం. అర్ధరాత్రి 12 తర్వాత మద్యం దుకాణాలను తెరవరాదని యజమానులను హెచ్చరించాం. జిల్లాలో పోలీసు అధికారులు మొదలుకొని హోంగార్డు, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, షీ టీమ్స్ సిబ్బంది అందరూ రోడ్లపై పహారా కాయనున్నారు.

నిరంతర పెట్రోలింగ్..

జిల్లా కేంద్రంతోపాటు పట్టణ, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూనే ప్రధాన రహదారులు, హైవేపై నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తాం. ప్రార్థనా మందిరాలు, ఇతర అవసరమున్న చోట్లా బందోబస్తు పెంచుతాం. అలాగే రోడ్డు ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోనున్నాం. ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై నిఘా ఉంచుతాం. అలాంటి వారి బైక్‌లను సీజ్ చేస్తాం. పశువుల అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరిస్తాం.

డీజేలకు అనుమతి లేదు

సమూహంగా వేడుకలు నిర్వహించుకునే వారు ముందస్తుగా స్థానిక పోలీసుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. డీజేలకు మాత్రం అనుమతి లేదు. పెద్ద సంఖ్యలో ఫంక్షన్ హాళ్లలో వేడుకలు నిర్వహించే వారు డీఎస్పీ స్థాయి అధికారి అనుమతి తీసుకోవాలి. ఎక్కడైన డీజే, ఇతర మ్యూజిక్ సిస్టంలతో ప్రజలు ఇబ్బంది పడితే పోలీసులకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.

అర్ధరాత్రి తర్వాత ఆంక్షలు

జిల్లా కేంద్రం, పట్టణ, మండల కేంద్రాల్లో సమయంలోగా దుకాణాలు బంద్ పాటించాలి. ఒంటి గంట తర్వాత రోడ్లపై ఎవరూ తిరగొద్దు. కాదని ఎవరైనా రోడ్లపైకి వచ్చి వేడుకల పేరిట రచ్చ చేస్తే కఠిన చర్యలు ఉంటాయి. రహదారులపై మద్యం సేవించినా చర్యలు తప్పవు. ప్రజలంతా సంతోషంగా వేడుకలు నిర్వహించుకోవాలి. పోలీసుల ఆంక్షలు ఉల్లంఘిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలి.

ఆదివాసీలు ఆరోగ్యంపై
శ్రద్ధ చూపాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ

తిర్యాణి(ఆసిఫాబాద్): ఆదివాసీలు తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మంగీ గ్రామంలో ఆదివారం మెడిలైఫ్ ఆస్పత్రి వైద్యసిబ్బందితో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యతోనే ఆదివాసీల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతిఒక్కరూ తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలని సూచించారు. ఆత్మహత్యలకు పాల్పడకుండా సమస్యల పరిష్కారానికి పోలీసులకు సాయం తీసుకోవాలన్నారు. అసాంఘిక శక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించొద్దని కోరారు. గంజాయి సాగు, వాడకం సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు. సైబర్ మోసాలకు గురైన వారు 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నిరుపేదలకు దుప్పట్లు, యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) ప్రభాకర్‌రావు, డీఎస్పీ కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జువ్వాజి అనిల్‌గౌడ్, సీఐ స్వామి, ఎస్సైలు తీగల మాధవ్‌గౌడ్, చంద్రశేఖర్, విజయ్, వైద్యులు కుమారస్వామి, రఘు వంశీ, శ్రేయ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యూ), కెరమెరిలో చలి అధికం



వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

కెరమెరి(ఆసిఫాబాద్): అడవుల జిల్లాగా పేరొందిన కుమురంభీం ఆసిఫాబాద్‌లో ఏటా కనిష్ట ఉష్ణోగ్రతలు అతి తక్కువగా నమోదవుతాయి. ఇక్కడ తీవ్రమైన చలి ప్రజలను వణికిస్తుంది. కొద్దిరోజులుగా రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు సిర్పూర్(యూ), కెరమెరి మండలాల్లో నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం వాతావరణ కేంద్రాల పరిశీలన అధికారులు కెరమెరి, సిర్పూర్(యూ) మండల కేంద్రాల్లోని ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లను సందర్శించారు. ఫీల్డ్ టెక్నీషియన్ రాజేశ్, టీజీడీపీఎస్ సమ్మయ్య సైక్లోమీటర్ సాయంతో ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు వాతావరణ మార్పులను పరిశీలించారు. ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌లో నమోదైన ఉష్ణోగ్రతలు, సైక్లో మీటర్ ద్వారా నమోదు చేసిన ఉష్ణోగ్రతల్లో ఎలాంటి మార్పు లేదన్నారు. సిర్పూర్(యూ)లో 15.4, కెరమెరిలో 15.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. సముద్ర మట్టానికి ఎత్తులో ఉండటం, చుట్టూ అడవులు విస్తరించి ఉండటంతో ఇక్కడ చలి ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

నమోదు ఇలా..

వాతావరణ ఆధారిత కేంద్రంలో సెన్సార్‌తో కూడిన చిన్నపరికరం సాయంతో వాతావరణ వివరాలు ఆటోమెటిక్‌గా నమోదవుతాయి. ఈ వివరాలను మళ్లీ సైక్లో మీటరు ద్వారా సరిపోల్చుతారు. ఏటా తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ఆధ్వర్యంలో 20 కేంద్రాల్లో వివరాలు నమోదు చేస్తారు. వివరాలను సరిపోల్చి తేడాలను పరిశీలిస్తారు. కేంద్రాల ద్వారా సేకరించిన వివరాలను https://tgdps. telangana. gov. in వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. ఇందులో జిల్లాల వారీగా వాతావరణం, ఉష్ణోగ్రతలు, వర్షసూచన తదితర వివరాలు తెలుసుకోవచ్చు.

ముగిసిన షష్టి బోనాలు



బోనానికి పూజలు చేస్తున్న భక్తులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో షష్టి బోనాలు ఆదివారంతో ముగిశాయి. డిసెంబర్‌లో నాలుగు ఆది, బుధవారాల్లో శివమల్లన్నకు భక్తులు బోనాలు సమర్పించారు. నిష్ఠతో బోనాలు వండి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ అధికారులు చర్యలు చేపట్టారు. కాగా హుండీల లెక్కింపు వచ్చే నెల 2న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఈవో వేణుగోపాల్ గుప్తా తెలిపారు.

క్లుప్తంగా

ప్రపంచ తెలుగు మహాసభల్లో మనోళ్లు



ప్రశంసాపత్రం, మెమొంటోతో రాజమల్లు



ప్రశంసాపత్రం, మెమొంటోతో మహేందర్

చెన్నూర్: విజయవాడలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించిన ఆరో ప్రపంచ తెలుగు మహాసభల్లో మంచిర్యాల జిల్లా చెన్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు, రచయిత దబ్బెట రాజమల్లు, మంచిర్యాల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు బొడ్డు మహేందర్ ప్రతిభ కనబర్చారు. సాహితీ సదస్సులో పాల్గొని తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాజమల్లు, మహేందర్‌ను ప్రశంసా పత్రాలతో పాటు మెమొంటోలతో సత్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న గోవర్ధన్ రెడ్డి

ఆదిలాబాద్: సీఎం కప్ జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయి సీఎం కప్ తైక్వాండో ఎంపిక పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో జిల్లా పేరును అగ్రభాగాన నిలపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, తైక్వాండో జిల్లా ఇన్‌చార్జి అన్నారపు వీరేశ్, రాష్ట్ర టెక్నికల్ కమిటీ చైర్మన్ వెంకటస్వామి, సీనియర్ పీడీ హరిచరణ్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు శివప్రసాద్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరు బలవన్మరణం



ఇందల్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: ఉరేసుకుని ఒకరు బలవన్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై దిలీప్ తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన ఆడె ఇందల్ (40) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. శనివారం ఆదిలాబాద్‌లో చికిత్స చేయించుకున్నాడు. రాత్రి కావడంతో ఉట్నూర్‌లో ఉన్న తన సోదరుడు సంజీవ్ ఇంటికి వెళ్లాడు. నొప్పి అధికం కావడంతో భరించలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతునికి భార్య స్వాతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంజీవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

లింగాపూర్: విషయం తెలుసుకున్న రెహమాన్ ఫౌండేషన్ చైర్మన్ అబ్దుల్ రెహమాన్ మృతుని అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించాడు.

జీవన వైవిధ్యం.. ప్రాణహితం



కశ్మీర్ దాల్ లేక్ కాదు.. తలాయి తీరం

మదిని మైమరిపించే ప్రకృతి అందాలు.. జన జీవనానికి ఉపాధి నిచ్చే అవకాశాలు.. జీవాలకు ప్రాణం పోసే వనరులు.. ఇవన్నీ కలిసిన ప్రాంతం ప్రాణహిత నదీ తీరం. అబ్బురపరిచే అరుదైన దృశ్యాలకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం తలాయి గ్రామ సమీపంలోని ప్రాణహిత తీరం నిలయంగా ఉంది.

– చింతలమానెపల్లి/బెజ్జూర్

- సహజ సౌందర్యం
- జన జీవనోపాధికి నిలయం
- తలాయి వద్ద అరుదైన అందాలు
- పర్యాటక అభివృద్ధికి అవకాశాలు



నదీ తీరంలో జీవనం సాగిస్తున్న కుటుంబం

సహజ సౌందర్యం..

ప్రాణహిత నది సహజ సౌందర్యానికి నిలయం. ఇరువైపులా దట్టమైన అటవీ ప్రాంతం. విశాలమైన ఇసుకమేటలు...తీరంలో మొక్కజొన్న చేలు.. నదిలో చేపల వేటకోసం పడవల్లో మత్స్యకారులు.. చేపల వేటకు వచ్చే పక్షుల సందడి..జలకళతో వంపులు తిరుగుతూ ప్రవహిస్తోంది ప్రాణహిత. తెల్ల ఇసుక మడుగుగా స్థానికులు పిలుచుకునే ఈప్రాంతంలో నది అందాలతో హొయలు పోతున్నట్లుగా కనిపిస్తుంది.

వివాదం.. పరిష్కారం.

తెలంగాణ, మహారాష్ట్రలకు ప్రాణహిత నది సరిహద్దుగా ఉంది. దీంతో తలాయి వద్ద ఇరు ప్రాంతాల ప్రజలకు వివాదం నెలకొంది. చేపలు పట్టడంపై ఇరు గ్రామాల ప్రజలు కొన్నేళ్ల క్రితం అభ్యంతరం తెలిపారు. కానీ ఈవివాదం ఇరు ప్రాంతాల పెద్దమనుషుల జోక్యంతో పరిష్కారమైంది. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సమస్య పరిష్కారంతో ఇరు ప్రాంతాల ప్రజలు నదిలో చేపలు పట్టడం ద్వారా ఉపాధి పొందుతున్నారు.

పర్యాటక అభివృద్ధికి అవకాశాలు

అరుదైన సహజ సౌందర్యం ఉన్న తలాయి ప్రాంతం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. ఇక్కడికి చేరుకోవడానికి రోడ్డు మార్గం ఉంది. ఈప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపాధి కల్పించవచ్చు. ఇక్కడికి ఏటా వందల సంఖ్యలో ప్రకృతి ప్రేమికులు వస్తుంటారు. ప్రాణహిత నదికి మహారాష్ట్ర వైపు కమలాపూర్ ఏనుగుల సంరక్షణ కేంద్రం, వెంకటాపూర్ వెంకటేశ్వర ఆలయం, భామ్రాగడ్ పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి.

జీవనోపాధి..

నదులు నాగరికతకు నిలయాలు. నదుల్లోని వనరులను వినియోగించుకుని మనిషి తరాలుగా లబ్ధిపొందుతున్నాడు. తలాయి వద్ద ప్రాణహిత నదిలో చేపలు పట్టడం ద్వారా 150కు పైగా కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. తలాయి గ్రామం నుంచి సుమారు 10 కిలోమీటర్ల దూరం నీటిమట్టం ఏకాలంలోనూ అడుగంటదు. మహారాష్ట్ర వైపు దేవలమర్రి, తలాయి, సమీప గ్రామాల్లోని ప్రజలు ఎనిమిది నెలల పాటు నదిపై ఆధారపడి జీవిస్తారు. దీనికోసం నదీ తీరంలోని ఇసుకలో తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకుంటారు. పిల్లా పాపలతో ఇక్కడే నివాసం ఉంటారు. నేటికీ సంప్రదాయ పద్ధతులైన నాటుపడవలు, వలల ద్వారా చేపలు పట్టడం విశేషం. ప్రాణహిత నదిలో దొరికే చేపలకు స్థానిక మార్కెట్‌లో డిమాండ్ ఉంది.



నదిలో చేపలు పడుతున్న దంపతులు

చేపల వేటతో ఉపాధి



మహారాష్ట్ర వైపు ఉన్న దేవలమర్రి, తెలంగాణలోని తలాయి గ్రామానికి చెందిన ప్రజలు ఇక్కడ చేపలు పట్టుకుని జీవనోపాధి పొందుతున్నాం. గతంలో ఈప్రాంతంలో వివాదం ఉన్నా ఇరు ప్రాంతాల పెద్దమనుషులు సమస్య పరిష్కరించారు. ఎలాంటి వివాదాలు లేకుండా జీవనోపాధి పొందుతున్నాం.– పాణెం భీమన్న, తలాయి

కుటుంబమంతా ఇక్కడే..



వర్షాకాలం ముగిసిందంటే నదీ తీరానికి వస్తాం. నా భార్య, కొడుకు, కోడలు ఇక్కడే నివాసం ఏర్పాటు చేసుకుంటాం. నెలల తరబడి నదిలోనే జీవనం సాగుతుంది. వర్షాకాలంలో పంటలు వేసే సమయంలో తిరిగి ఊళ్లకు పోతాం. ఉపాధినిచ్చే ప్రాణహితను అదృష్టంలా భావిస్తాం.

– పాణెం శంకర్, తలాయి

పూర్వీకుల నుంచి..



మా కుటుంబాల్లో ఎక్కువ మందికి భూములు లేవు. ఇప్పుడిప్పుడే కొంత మంది ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్నా ఎక్కువ మంది నదిపై ఆధారపడి జీవిస్తున్నాం. మాతాతలు ఇక్కడే బతికారు. మేంకూడా ఇక్కడే బతుకుతున్నాం.

– తోకల చిన్నన్న, దేవలమర్రి

ఇసుక లారీకి రూ.80వేల జరిమానా

తాంసి(బోథ్): భీంపూర్ మండలంలోని తాంసి(కె) శివారులో పెన్‌గంగ నది నుంచి మహారాష్ట్రకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని ఈ నెల 22న పిప్పల్‌కోటి వద్ద భీంపూర్ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. లారీని స్టేషన్‌కు తరలించి పోలీసులు తదుపరి చర్యల నిమిత్తం మైనింగ్‌శాఖ అధికారులకు లేఖ రాశారు. శనివారం సాయంత్రం జిల్లా మైనింగ్‌శాఖ అధికారులు ఇసుక విలువ అంచనా వేశారు. మైనింగ్‌శాఖ జిల్లా ఏడీ ఆర్.రవీందర్ లారీకి రూ.80వేల జరిమానా విధించినట్లు భీంపూర్ ఎస్సై కలీం ఆదివారం తెలిపారు. పెన్‌గంగ నుంచి ఇసుక తరలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

కలప పట్టివేత



ఇచ్చోడలో పట్టుకున్న కలప, బైక్‌లు

ఇచ్చోడ(బోథ్): మండలంలోని హరినాయక్ తండా వద్ద ఆదివారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనాలపై అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ రేంజి అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సిరిచెల్మ నుంచి ఇచ్చోడ వైపునకు వస్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కలప విలువ సుమారు రూ.27 వేలు ఉంటుందన్నారు. నిందితులు పరారీలో ఉన్నారని, కలపతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో అటవీశాఖ సిబ్బంది సజన్‌లాల్, విశ్వజీత్, నౌసిలాల్, శివచరణ్, తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట అటవీ రేంజ్ పరిధిలోని నాగసముద్రం సమీపంలో రూ.5,649 విలువైన రెండు టేకు దుంగలను పట్టుకున్నట్లు డీఆర్వో సాగరిక తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కలప దుంగలు పట్టుకెళ్తున్న ఓ వ్యక్తిని వెంబడించడంతో పడేసి పారిపోయాడు. వాటిని తాళ్లపేట రేంజికి తరలించామని డీఆర్వో పేర్కొన్నారు. పట్టుకున్న వారిలో ఎఫ్‌బీవో రహీమొద్దీన్, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా జాతీయ యోగా, కరాటే పోటీలు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో జాతీయస్థాయి యోగా, కరాటే చాంపియన్‌షిప్ 2024–25 పోటీలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. పట్టణంలోని పద్మశాలీ భవన్, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. స్పోర్ట్స్, కరాటే అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఎనగందుల వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ జె.శ్వేత, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్ ప్రారంభించారు. తమిళనాడు, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి దాదాపు 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈసందర్భంగా అతిథులు మాట్లాడారు. వ్యక్తిగత ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. యోగాను జీవితంలో భాగంగా చేసుకుంటే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. గెలుపు ఓటములను సమానంగా చూడాలని సూచించారు.



యోగాసనాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

అలరించిన విన్యాసాలు..

క్రీడాపోటీలకు ముందు చిన్నారులు యోగా, కరాటే విన్యాసాలు ప్రదర్శించారు. ఎంతో నేర్పుతో కరాటేను ప్రదర్శించడం ఆకట్టుకుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కరాటే, యోగా క్రీడాకారులు పోటాపోటీగా విన్యాసాలు చేసి అబ్బురపరిచారు. కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రవికుమార్, టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, మున్సిపల్ కౌన్సిలర్ బండి ప్రభాకర్, ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకుడు మేడి పున్నంచందు, కరాటే మాస్టర్లు తగరపు శంకర్, ఎం.రాజేశ్, విజ్జగిరి రవి, నారాయణ, శిరీష పాల్గొన్నారు.

ఆర్పీల పోరుబాట

- నేడు హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి సమావేశం
- ఉమ్మడి జిల్లా నుంచి వెళ్లనున్న మెప్మా రిసోర్స్ పర్సన్లు
- ఇప్పటికే మున్సిపల్ కమిషనర్ల నుంచి ముందస్తు అనుమతి..

మంచిర్యాలటౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో పనిచేస్తున్న ఆర్పీ(రిసోర్స్ పర్సన్)లు పోరుబాట పట్టనున్నారు. ప్రభుత్వపరంగా నిధులు కేటాయించాలని, గౌరవ వేతనాలు పెంచాలని, పీఆర్సీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో సోమవారం జరిగే తెలంగాణ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆర్పీల సంక్షేమ సంఘం సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఆర్పీలు సిద్ధమయ్యారు. సోమవారం మూకుమ్మడిగా హైదరాబాద్‌లో జరిగే యూనియన్ సమావేశానికి వెళ్లేందుకు శనివారం రోజే మున్సిపల్ కమిషనర్ల అనుమతి తీసుకున్నారు. ఈమేరకు అందరికీ సెలవు ఇవ్వాలని వినతిపత్రాలు అందించారు. మహిళా సంఘాలను బలోపేతం చేస్తూ, వారిలో ఆర్థిక పురోగతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నా, ప్రభుత్వానికి అవసరమైన అన్ని రకాల సర్వేలు, కార్యక్రమాలను నిర్వహణలో పాలుపంచుకుంటున్నా, ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నా ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించడం లేదని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకన్నా ఎక్కువగా బరువు బాధ్యతలను మోస్తున్నా తమకు తగిన గుర్తింపు, శ్రమకు తగిన ఫలితం రావడం లేదని పేర్కొన్నారు. అధికారులు సైతం తమకు ఎలాంటి సంబంధం లేని పనులు చేయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్పీలు

ప్రధాన డిమాండ్లు ఇవే..

- జీవో 164 ప్రకారం పీఎల్ఆర్ స్త్రీనిధి, లోకల్ బాడీ నిధుల నుంచి ఆర్పీలకు గౌరవ వేతనాలను ఇవ్వాలనే నిబంధన తొలగించి, సెర్ప్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వీవోఏల మాదిరిగా ప్రభుత్వపరంగా ప్రత్యేక నిధులు కేటాయించి గౌరవ వేతనాలు ఇవ్వాలి.
- గత ప్రభుత్వం అన్నిరంగాల వారికి 30 శాతం పీఆర్సీ అమలు చేసి ఆర్పీలకు మాత్రమే ఇవ్వలేని, పీఆర్సీ అమలు చేయాలి.
- ఆర్పీలకు కనీస వేతనం రూ.20 వేలు ఉండాలి.
- ఆర్పీలందరికీ గుర్తింపు వచ్చేలా రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన డ్రెస్‌కోడ్ అమలు చేసి జాబ్‌చార్ట్ విడుదల విడుదల చేయాలి.
- ఆర్పీలు మరణిస్తే వారి కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల బీమా సౌకర్యం ఇవ్వాలి.
- మూడు నెలలకు ఒకసారి ఈసీల తీర్మానం రద్దు చేయాలి.

సెలవంటూ వెళ్లిపోయారు..!

- ఈ ఏడాది ప్రముఖుల అస్తమయం
- ఉమ్మడి జిల్లాలో విషాదం

2024 సంవత్సరం కష్ట సుఖాలకు నిలయమైంది. ఎన్నో మంచి కార్యక్రమాలు ఈ ఏడాది జరిగాయి. ఇదే సమయంలో కొన్ని విషాద ఘటనలూ జరిగాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు ఈ ఏడాది పరమపదించారు. గుస్సాడీ నేస్తం కనకరాజు కన్ను మూశాడు, గోండిలిపి యోధుడు అస్తమించాడు. తొలితరం రాజకీయ నేత నర్సారెడ్డి మృతి చెందాడు.



నేల రాలిన గుస్సాడీ నేస్తం!



కెరమెరి(ఆసిఫాబాద్): గుస్సాడీ అంటేనే కనక రాజుగా భావించే గుస్సాడి రాజును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 2024లో కోల్పోయింది. గుస్సాడీ కళానృత్యాన్ని తన సర్వస్వంగా భావించిన కళాప్రపూర్ణ కనక (గుస్సాడి)రాజు ఈ ఏడాది అక్టోబర్ 24న జైనూర్ మండలంలోని మార్లవాయిలో మృతి చెందాడు. 1981లో అప్పటి ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధి ఏడు నిమిషాల పాటు రాజుతో నృత్యం చేసింది. ఆమెకు నెమలి పింఛాల టోపీని తొడిగించి, కాళ్లకు గజ్జెలు కట్టి, చేతికి దుడ్డు (కర్ర) ఇచ్చిన ఏకైక వ్యక్తి కనక రాజు.

నర్సన్నబాపు అస్తమయం..

నిర్మల్: నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం మలక్‌చించోలికి చెందిన పొద్దుటూరి గంగారెడ్డి ఏకైక సంతానం నర్సారెడ్డి (నర్సన్న బాపు) 1931 సెప్టెంబర్ 22న జన్మించారు. 1971 నుంచి 1972 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడిగా సేవలందించారు. 1978 ఎన్నికల తర్వాత అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు మంత్రివర్గంలో నీటిపారుదల శాఖ, రెవెన్యూశాఖ, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రిగా పనిచేశారు. 1967 నుంచి 1982 వరకు మూడు పర్యాయాలు గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా పనిచేశారు. 1991లో ఆదిలాబాద్ ఎంపీగా, ఒకసారి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడిగా పనిచేశారు. తెలంగాణ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా, నిబంధనల కమిటీ, ప్రభుత్వ హామీల కమిటీ, విజ్ఞాపనల కమిటీ, సంప్రదింపుల కమిటీల సభ్యుడిగానూ పనిచేశారు. వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా ఈ ఏడాది జనవరి 29న హైదరాబాద్‌లోని తన నివాసంలోనే తుదిశ్వాస విడిచారు.

'ఇథనాల్' మంటలు

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు వద్దంటూ జనవరి 26న నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల రైతులు రోడ్డెక్కారు. దిలావర్‌పూర్, గుండంపల్లి, సముందర్‌పల్లి, టెంబుర్నితో పాటు సమీప గ్రామాల ప్రజలు మండల కేంద్రంలోని 61వ జాతీయ రహదారిపై బైటాయించారు. ఆర్డీవో రత్నకల్యాణిని అడ్డుకుని వాహనంపై దాడి చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిర్మించిన ఇథనాల్ ఫ్యాక్టరీపై రైతులు దాడి చేసి, ప్రహరీగోడను కూల్చడంతో పాటు ఒక వాహనానికి నిప్పుపెట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జీ చేశారు.



ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దని ఆందోళన (ఫైల్)

- మండలంలోని రైతులు, యువకులతో పాటు మహిళలు, వృద్ధులు, చిన్నారులు సైతం ఆందోళనలో పాల్గొనడం, పరిస్థితి సీరియస్‌గా మారడంతో జిల్లా అధికారుల సమాచారం మేరకు జనవరి 27న రాష్ట్ర ప్రభుత్వం ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈమేరకు మండల వాసులు ఆందోళన విరమించారు.

గోండి లిపిని ప్రపంచానికి తెలియజేసిన యోధుడు

నార్నూర్: గోండి లిపి ప్రతులను ప్రపంచానికి తెలియజేసిన యోధుడు కోట్నాక్ జంగు. 2014లో నార్నూర్ మండలంలోని గుంజాలలో గోండి లిపి అధ్యయన కేంద్రం ఏర్పాటు చేయడంలో ప్రముఖుడు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 పాఠశాలను నెలకొల్పి 400 మంది విద్యార్థులకు గోండి లిపిలో విద్యాబోధన చేశారు. ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు సహకారంతో గోండి లిపిలో 2014లో మొదటి వాచకం, 2016లో రెండో వాచకం రాశారు. 2024 సెప్టెంబర్ 23న అనారోగ్యంతో మృతి చెందాడు.



కోట్నాక్ జంగు (ఫైల్)

దారి దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

గుడిహత్నూర్(బోథ్): దారి దోపిడీకి యత్నించిన కేసులో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ భీమేష్ తెలిపారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. స్థానిక దుర్గా వైన్స్‌లో పనిచేస్తున్న బండి సురేష్ నిత్యం వైన్స్‌లో వచ్చిన డబ్బులతో రాత్రి కిలోమీటర్ దూరంలో ఉన్న ఇంటికి వెళ్తుండేవాడు. అది గమనించిన మండలంలోని మన్నూర్‌కు చెందిన ఘుగె రోహన్, జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌కు చెందిన సెంబెటి సాయికుమార్, హమాలీవాడకు చెందిన మీసాల అజయ్, విద్యానగర్‌కు చెందిన ఇల్లెందుల శివప్రసాద్ ఈ నెల 25న రాత్రి జాతీయ రహదారి 44పై సురేష్ వాహనాన్ని నిలువరించి కంట్లో కారం చల్లి డబ్బుల సంచి లాక్కునే ప్రయత్నం చేశారు. బాధితుడు ప్రతిఘటించడంతో తమతో తెచ్చుకున్న కత్తులతో గాయపరిచారు. గట్టిగా అరవడంతో పరారయ్యారు. బాధితుడు వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై మహేందర్ దర్యాప్తు ప్రారంభించారు. సీసీ పుటేజీలు, ఇతర ఆధారాల ప్రకారం పాత నేరస్తుడైన రోహన్‌పై నిఘా పెట్టగా దోపిడీకి పాల్పడినట్లు నిర్ధారించారు. అతని కాల్‌డేటా ఆధారంగా మిగతా వారిని పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రెండు స్కూటీలు, దోపిడీకి వాడిన కత్తులు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా వారంతా పాత నేరస్తులుగా గుర్తించారు. రోహన్ గతంలో సుపారీ హత్య కేసులో, పోక్సో కేసులో నిందితుడిగా ఉన్నాడు. జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం నేరాలకు పాల్పడుతున్నారని గుర్తించారు. నిందితులపై రౌడీ షీట్ తెరువనున్నట్లు సీఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీమేష్

'మాలలు ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి'

ఆదిలాబాద్‌రూరల్: మాలలు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాల సంక్షేమ సంఘం భవనం వద్ద మాలల భవిష్యత్ కార్యాచరణ, జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అంబేడ్కర్, పీవీరావు, కాక చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ అంశంపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలు ఐక్యం కావాలని ఎప్పటినుంచో నాయకులు కృషి చేస్తున్నా ఫలితం లేదన్నారు. కానీ ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు అనంతరం ఐక్యం కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జేఏసీ చైర్మన్ చన్నయ్య, కన్వీనర్ సర్వయ్య, ఓయూ జేఏసీ నాయకులు మందాల భాస్కర్, రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ బాలరాజు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు రాజేశ్వర్, స్వరూప, మేకల మల్లన్న, మధుకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన వడాయి బాపురావు (52) కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం కొండపల్లి బస్టాండ్ వద్ద గల చికెన్ సెంటర్‌లో పని చేశాడు. రాత్రి చికెన్ సెంటర్ వ్యర్థాలను ఊరి బయట పడేసి వస్తుండగా కై రిగాం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. బాపురావుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే రోడ్డు ప్రమాదానికి బొలెరో కారణమని ప్రత్యక్ష సాక్షులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు వాహనం కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు సమాచారం.